

విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న కలెక్టర్

వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

- జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో కలెక్టర్

కొండపాక, జూన్ 20 : వ్యక్తిగత పరిశుభ్రతతో పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ మను చౌదరి అన్నారు. గురువారం కొండపాక మోడల్ స్కూల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. 1-19 వయసు గల పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఫలితంగా శరీరంలో ఉన్న పరాన్న జీవులైన నులిపురుగులు నశిస్తాయని పేర్కొన్నారు. నులిపురుగుల వలన ఏర్పడే అనారోగ్య సమస్యల నుంచి పిల్లలు రక్షించబడతారని, పిల్లల్లో శారీరక ఎదుగుదల, మానసిక ఎదుగుదల, రక్తహీనత పోషకాహార లోపం తగ్గి చురుగ్గా ఉంటారని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన మేరకు 2,38,559 పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను అందించనున్నట్లు తెలిపారు. ప్రజలందరి సహకారంతో సిద్దిపేట జిల్లాను రక్తహీనత రహిత జిల్లాగా మార్చాలన్నారు. ఒకవేళ ఎవరైనా పిల్లలు ఈరోజు మాత్ర తీసుకోని మాప్ డేగా 27న అందించనున్నట్లు స్పష్టం చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయరాణి మాట్లాడుతూ.. నులిపురుగుల నివారణలో వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోలు డాక్టర్ కాశీనాథ్, డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వినోద్ బాబ్జీ, మండల పరిషత్ అధ్యక్షుడు అనసూయ కనకరాములు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, కొండపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వన్నీసా, ఏవో రవీందర్ రెడ్డి, హెచ్ఈ సత్యనారాయణ, సీసీడెనియల్, మోడల్ స్కూల్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, కొండపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న డీటీవో కొండల్‌రావు, సిబ్బంది

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తాం

- హుస్నాబాద్‌లో 3 బస్సులు సీజ్ : డీటీవో

హుస్నాబాద్ రూరల్, జూన్ 20: స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ లేకుండా నడిపితే చట్టపరమైన చర్యలతో పాటు బస్సులను సీజ్ చేస్తామని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి కొండల్‌రావు హెచ్చరించారు. గురువారం హుస్నాబాద్‌లోని పలు స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ ఎంవీఐ పరిధిలో 42 బస్సులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 22 బస్సులను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని 3 బస్సులను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలల యాజమాన్యాలు స్కూళ్ల ప్రారంభానికి ముందే సరైన ధ్రువపత్రాలను, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను తీసుకోవాలని సూచించారు. అనుభవం కలిగిన డ్రైవర్లతో బస్సులను నడిపించాలన్నారు. తనిఖీ బృందంలో హుస్నాబాద్ ఎంవీఐ అధికారి, సిబ్బంది ఉన్నారు.

గొంతులో గులకరాయి ఇరుక్కుని చిన్నారి మృతి



అలీషా (ఫైల్)

చేర్యాల, జూన్ 20 : చిన్నారులతో కలిసి ఆడుకుంటూ నోట్లో వేసుకున్న గులకరాయి గొంతులో ఇరుక్కుని చిన్నారి మృతి చెందిన సంఘటన గురువారం కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామంలో చోటుచేసుకున్నది. చేర్యాల మండ లం కడవేరుగు గ్రామానికి చెందిన షబీర్-జరీనా దంపతుల ఏడాదిన్నర కూతురు అలీషా కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామంలోని అమ్మమ్మ ఇంటి ఆవరణలో చుట్టుపక్కల చిన్నారులతో కలిసి ఆడుకుంటూ గులకరాయి నోట్లో పెట్టుకుని మింగింది. గొంతులో ఇరుక్కుని ఊపిరి ఆడకపోగా, రక్తంకారడాన్ని గమనించిన చుట్టుపక్కవారు కుటుంబసభ్యులకు తెలిపారు. వారు హుటాహుటిన కడవేరుగు గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్స జరిపినా ప్రయోజనం కానరాకపోవడంతో చేర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో పెద్దాస్పత్రికి తీసుకువెళ్లమని సూచించారు. సిద్దిపేటలోని చిన్నపిల్లల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందింది. అల్లారుముద్దుగా చూసుకున్న పాప కన్నుమూయడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ముదురుతున్న రగడ

కమిషనర్ వర్సెస్ బీఆర్ఎస్

- కౌన్సిల్‌లో కమిషనర్‌ను కింద కూర్చోబెట్టిన కౌన్సిలర్లు
- సీడీఎంఏకు ప్రసన్నరాణి ఫిర్యాదు
- విచారణ నిమిత్తం సిద్దిపేటకు మున్సిపల్ ఆర్‌డీ

సిద్దిపేట టౌన్, జూన్ 20 : మాట వినలేదనో, ఇతర కారణాలేమిటో కాని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, బీఆర్ఎస్ కౌన్సిలర్ల మధ్య గత కొన్ని రోజులుగా నువ్వా..? నేనా..? అన్నట్లుగా రగడ మొదలైంది. తారస్థాయికి చేరిన మనస్పర్థల కారణంగా ఈనెల 10న జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో స్టేజీపై కూర్చున్న కమిషనర్ ప్రసన్నరాణి మిగతా అధికారులతో కలిసి స్టేజీ కింద కూర్చోవాలని బీఆర్ఎస్ నాయకులు పట్టుబట్టారు. దీంతో చేసేది లేక ఆమె అధికారులతో కలిసి కింద కూర్చు న్నారు. కమిషనర్ ప్రసన్నరాణిని బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవమానించారంటూ కాంగ్రెస్ కౌన్సిలర్లు మండిపడుతున్నారు.

సీడీఎంఏకు ఫిర్యాదు చేసిన ప్రసన్నరాణి

మున్సిపల్ సమావేశాల్లో కమిషనర్ వేదికపై కూర్చోవడం ప్రొటోకాల్. అయితే ఇటీవల జరిగిన సాధారణ సమావేశానికి ముందే ఎప్పటిలాగే స్టేజీపై కూర్చున్న తనను కింద కూర్చోవాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవమానించారంటూ మున్సిపల్ కమిషనర్ ఈ నెల 10న కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఎ)కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 15న కమిషనర్ ప్రసన్నరాణి బాధ్యతలు స్వీకరించారు. వచ్చిన నాలుగు నెలల్లోనే బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కమిషనర్ మధ్య అంతలా ఏ వివాదం వల్ల రగడ మొదలైంది..?అనే విషయమై అటు మున్సిపల్ అధికారులు, ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.



సిద్ది పేట మున్సిపల్ కార్యాలయం



స్టేజీ కింద అధికారులతో కలిసి కూర్చున్న కమిషనర్ ప్రసన్నరాణి (ఫైల్)

మున్సిపల్ ఆర్‌డీ విచారణ

మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు బుధవారం హైదరాబాద్ నుంచి రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సిద్దిపేట మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు, అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి ఒక్కొక్కరి నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు తెలిసింది. ఓ నివేదికను రూపొందించి సీడీఎంఏకు అందించనున్నట్లు మున్సిపల్ వర్గాల సమాచారం.

సెలవుపై వెళ్లిన కమిషనర్

కౌన్సిల్ సమావేశంలో సభ్యులు అవమానించారంటూ సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఈ నెల 11 నుంచి సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. కమిషనర్ ప్రసన్నరాణి సెలవుపై వెళ్లడంతో దాదాపు అన్ని ఫైల్స్ పెండింగ్‌లో పడ్డాయి. దీంతో కమిషనర్‌ను కావాలనే అవమానించారంటూ కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం కౌన్సిలర్లు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. ఇదే విషయమై కాంగ్రెస్ కౌన్సిలర్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే ఉదతంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు వర్సెస్ బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. త్వరలోనే బీఆర్ఎస్ కౌన్సిల్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతామని హెచ్చరిస్తున్నారు.

ఈ కమిషనర్ మాకొద్దు

కౌన్సిలర్లకు విలువ ఇవ్వడం లేదని, ఈ కమిషనర్ ప్రసన్నరాణి తమకు వద్దంటూ పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఎదుట వెల్లడించినట్లు సమాచారం. బుధవారం వచ్చిన రీజనల్ డైరెక్టర్‌కు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ ప్రజన్నరాణి వచ్చిన నాలుగు నెలల నుంచి ఏం చేశారో వివరించారు. కౌన్సిల్ సభ్యులకు విలువ ఇవ్వకపోవడంతో పాటు, కౌన్సిలర్లకు కమిషనర్ కార్యాలయానికి ఎందుకు వస్తున్నారని, మీకు ఇక్కడ ఏం పని ఉందని అన్నట్లు ఆర్‌డీకి వివరించినట్లు పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు తెలిపారు. వార్డు కౌన్సిలర్లుగా వార్డు సమస్యలపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్తే తమను చాలా ఇబ్బందులకు గురిచేశారని, వార్డు సమస్యలు చెప్పుకుందామంటే ఆమె చాంబర్‌కు రానిచ్చే వారు కాదని తెలిపారు. అందువల్లే తమకు విలువ ఇవ్వని కమిషనర్‌ను స్టేజీ మీద కూర్చోవద్దని, అధికారులతో కలిసి కూర్చోవాలని సూచించామని చెప్పారు. ఏది ఏమైనా కమిషనర్, కౌన్సిల్ మధ్య రగులుకున్న వివాదాన్ని ప్రభుత్వం జోక్యం చేసుకొని పరిష్కరించి పట్టణాభివృద్ధికి అందరూ సహకరించాలని పట్టణవాసులు కోరుకుంటున్నారు.

అక్రమాలకు సహకరించలేదనే..

- కాంగ్రెస్ కౌన్సిలర్లు

సిద్దిపేట మున్సిపల్ పరిధిలో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు చేస్తున్న అక్రమాలకు సహకారం అందించడం లేదనే మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణిని కౌన్సిల్ సమావేశంలో అవమానపరిచారని కాంగ్రెస్ కౌన్సిలర్లు సాకిబాల్‌లక్ష్మిఆనంద్, శ్రీదేవి బుచ్చిరెడ్డి, రియాజ్, ఏంఐఎం కౌన్సిలర్ అర్షద్ ఆరోపించారు. గురువారం సిద్దిపేటలో వారు మాట్లాడుతూ ఇటీవల మున్సిపల్ కమిషనర్‌ను బీఆర్ఎస్ నాయకులు స్టేజీ కింద కూర్చోబెట్టారని, కమిషనర్ ఫిర్యాదు మేరకు ఆర్‌డీ విచారణ జరిపారని తెలిపారు. విచారణకు ప్రతిపక్ష కౌన్సిలర్లను పిలవకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇక్కడి నుంచి కమిషనర్‌ను బదిలీ చేయాలని ఆర్‌డీకి బీఆర్ఎస్ వారు వినతి పత్రం అందజేశారని తెలిపారు. 20 ఏళ్లుగా సిద్దిపేట మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతి అంతా..ఇంతా కాదని, త్వరలోనే విజిలెన్స్ అధికారుల ద్వారా విచారణ జరిపిస్తామన్నారు. ఈ విషయమై పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం కూడా ఇచ్చామని తెలిపారు. మందబలంతో బీఆర్ఎస్ నాయకులు కబ్జాలకు పాల్పడుతూ ప్రభుత్వ భూముల్లో కాంపౌండ్‌లు నిర్మించి వాటికి ఇంటి నంబర్‌లు కేటాయించమని కమిషనర్‌పై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. గతంలో పట్టణంలోని శివారు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి రూ.40 లక్షలు కౌన్సిల్‌లో ఆమోదం చేశారని, కానీ ఎక్కడా కూడా కెమెరాలు బిగించలేదని ఆరోపించారు. ఆ డబ్బు ఎక్కడికి పోయిందని వారు ప్రశ్నించారు. కొన్నేళ్లుగా వారు ఆడిందే ఆటగా సాగిందని, ఇప్పుడు అలా సాగనివ్వబోమని త్వరలో ఇప్పుడున్న కౌన్సిల్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

విద్యుత్ అంతరాయం కలగొద్దు

సిద్దిపేట టౌన్, జూన్ 20 : విద్యుత్ అంతరాయం, జియోగ్రాఫికల్, సమాచార వ్యవస్థపై సిద్దిపేట, మెదక్ విద్యుత్‌శాఖ ఇంజనీర్లకు సిద్దిపేట విద్యుత్ ఎస్ఈ మోహన్‌రెడ్డి శిక్షణనందించారు. గురువారం సిద్దిపేటలోని విద్యుత్ భవన్‌లో సిద్దిపేట విద్యుత్ ఎస్ఈ మోహన్‌రెడ్డి, మెదక్ ఎస్ఈ జానకిరామ్‌లు మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్ అంతరాయం ఏర్పడితే సహించడం లేదన్నారు. మరోవైపు కిలోమీటర్ల కొద్ది విస్తరించిన లైన్లు, ఆ లైన్లు ఇన్సులేటెడ్ కాకపోవడంతో చెట్టు తగిలినా, గాలి వీచినా ఇలా అనేక కారణాల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. వీటికి శాశ్వత పరిష్కారం దిశగా టీజీఎస్ పీడీసీఎల్ అధునాతన యాప్ రూపొందించిందని, దీని ద్వారా విద్యుత్ వ్యవస్థలో ఏర్పడుతున్న అనేక సమస్యలకు పరిష్కారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఇంజనీర్ మహేష్‌కుమార్, శ్రీనాథ్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ గంగాధర్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిద్ది పేట విద్యుత్ ఎస్ఈ మోహన్‌రెడ్డి

చేర్యాల రక్తంలోనే పోరాటం, ప్రశ్నించేతత్వం

- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క

మద్దూరు, జూన్ 20 : నైజాం రజాకార్లను ఎదుర్కోవడంతో పాటు విప్లవ, ఉద్యమాలు పురుడుపోసుకున్న చేర్యాల రక్తంలోనే పోరాటం, ప్రశ్నించేతత్వాలు ఇమిడి ఉన్నాయని రాష్ట్ర పంచాయత్‌రాజ్‌శాఖ మంత్రి సీతక్క అన్నారు. చేర్యాల మండలం కమలాయపల్లిలో ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ బయోడీజిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలను గురువారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. విప్లవోద్యమాలతో చారిత్రక నేపథ్యం కలిగిన చేర్యాల పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చిన్నాభిన్నం కావడం విచారకరమన్నారు. ఈప్రాంతంనుండే గోదావరి జలాలను తరలింపచేసి ఇక్కడి రైతాంగానికి అన్యాయం చేశారన్నారు. తాను ప్రాతినిధ్యం వహించిన ములుగు తలాపు నుంచే గోదావరి ప్రవహించినా కేసీఆర్ నీళ్లు ఇవ్వలేదన్నారు. ఇటీవల నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో గోదావరి జలాల విషయంలో సమీక్షించారని, నీటి విషయంలో ఈప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని వివరించినట్లు చెప్పారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పించడాన్ని ఓర్వలేక కేసీఆర్, అతని సంబంధీకులు ఆంధ్రావారిని తీసుకువచ్చి ధర్నాలు చేయించి పథకాన్ని అడ్డుకునే కుట్రలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో కార్మికులను ప్రభుత్వం తప్పక ఆదుకుంటుందన్నారు. ప్రజలకు న్యాయం చేసేది కాంగ్రెస్‌మాత్రమేనన్నారు. అభివృద్ధి, సాగు నీరు, మౌళికవసతుల కల్పనలో నిర్లక్ష్యానికి గురైన కమలాయపల్లి గ్రామానికి తాను అండగా ఉన్నానని మంత్రి సీతక్క అన్నారు. కార్యక్రమంలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, కాంగ్రెస్ జడ్పీఫ్లోర్ లీడర్ గిరి కొండల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అధ్యక్షులు కొమ్ము రవి, మేక మల్లేశం, నాగపురి కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెట్కూరి కమలాకర్, నిర్వహకులు లింగంపల్లి చంద్రశేఖర్, యాదగిరి, ప్రొ.శంకర్ యాదవ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

ఫలితాలొచ్చే.. అడ్మిషన్ దొరికే

సిద్దిపేటలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రవేశానికి ఈనెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహించగా గురువారం పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి. మొత్తం 650 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 250 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఇందులో 200 మంది విద్యార్థులు 6వ తరగతికి, మిగతా 50 మంది విద్యార్థులు వివిధ తరగతులకు అర్హత సాధించారు. గురువారం ప్రవేశ పరీక్ష ఫలితాలను చూసుకోవడానికి వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు అడ్మిషన్‌లు పొందారు.

- సిద్ది పేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్



పాఠశాలలోని నోటీసు బోర్డులో పేర్లు చూసుకుంటున్న విద్యార్థులు





అడ్మిషన్‌కు ధ్రువపత్రాలు అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసిన భార్య

హుస్నాబాద్‌రూరల్, జూన్ 20: ముగ్గురు కూతుళ్ల వివాహం చేసిన అనంతరం భార్యాభర్తలు అన్యోన్యంగా గడపాల్సిన సమయంలో భార్య మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి అతడిని అతి దారుణంగా హత్య చేసింది. అయితే, సొంత ఇంట్లోనే చంపేసి.. తన భర్తను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని ఇరుగుపొరుగు వారికి చెప్పింది. మూడు రోజుల క్రితం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామంలో ఇంట్లో నిద్రిస్తున్న గీకురు నర్సయ్యను గొడ్డలితో నరికి చంపిన కేసులో భార్య ఆమె ప్రియుడు నిందితులుగా పోలీసులు తేల్చారు. సీఐ శ్రీనివాస్ గురువారం హత్య సంఘటన వివరాలను వెల్లడించారు. గ్రామానికి చెందిన నర్సయ్యకు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉండగా, అందరి పెళ్లిళ్లు చేశాడు. అయితే, అతని భార్య ఎల్లవ్వ అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన మహ్మద్ రజాక్‌తో కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. విషయం తెలిసి నర్సయ్య భార్యను పలుమార్లు హెచ్చరించాడు. అయినా, ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదు సరి కదా.. తమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించి, అతనిని హత్య చేయాలని పథకం వేసింది. ప్రియుడు రంజాన్, ఎల్లవ్వ కలిసి గత సోమవారం రాత్రి ఇంట్లో నిద్రపోతున్న నర్సయ్యను గొడ్డలితో దారుణంగా నరికి చంపేశారు. తర్వాత మధ్య రాత్రి తన భర్తను ఎవరో చంపేశారని రోదిస్తూ ఇరుగు, పొరుగు వారికి ఎల్లవ్వ చెప్పింది. వారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. అయితే, నర్సయ్యను హత్య చేయాల్సిన అవసరం ఎవరికి ఉందనే కోణంలో దర్యాప్తు చేపట్టగా, పోలీసులకు భార్యపై అనుమానం వచ్చింది. దీంతో ఎల్లవ్వను ప్రశ్నించగా.. జరిగిన విషయం బయటపడింది. దీంతో ఎల్లవ్వతో పాటు ఆమె ప్రియుడు రజాక్‌ను అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు.



హత్య వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఈడీ దాడులు కలకలం..



- ఎమ్మెల్యే గూడెం సోదరులపై కేంద్ర సంస్థ నజర్
- ఇళ్లు, కార్యాలయాలను జల్లెడ పట్టిన అధికారులు
- ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు
- రూ.342 కోట్లు కట్టాలని మైనింగ్ శాఖ నోటీసుల నేపథ్యంలో ఈడీ ఫోకస్
- ఎమ్మెల్యే వర్గీయుల బెంబేలు

పటాన్‌చెరు, జూన్ 20: పటన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నివాసాలు, కార్యాలయాల్లో గురువారం రోజంతా ఈడీ సోదాలు నిర్వహించడం పటాన్‌చెరులో కలకలం రేపింది. పారిశ్రామికవాడ నుంచి మూడుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికైన మహిపాల్‌రెడ్డి రాజకీయంగా తిరుగులేదని రుజువు చేసుకున్నారు. అయితే, ఆయన అక్రమ మైనింగ్ ద్వారా పెద్ద ఎత్తున వెనకేసుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు మొదలుపెట్టారు. జిల్లా కలెక్టర్ రంగంలోకి దిగి లక్డారంలో ఎమ్మెల్యే సోదరుడు నడుపుతున్న సంతోష్ మినరల్స్ సంస్థ అక్రమాలను వెలికి తీసి సంస్థను సీజ్ చేశారు. ఏకకాలంలో మైనింగ్, రెవెన్యూ, పీసీబీ శాఖలు మధుసూదన్‌రెడ్డిపై కేసులు నమోదు చేశాయి. ఈ కేసులో ఆయన జైలుకు వెళ్లడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అయితే, మహిపాల్‌రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కావడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో ఆయన పార్టీ మారేలా ఒత్తిడి తెచ్చేందుకు కేసులు నమోదు చేశారని బీఆర్ఎస్ ప్రచారం చేసింది. ఈ క్రమంలోనే మహిపాల్‌రెడ్డి స్థానిక ముఖ్య నేతతో సంధి చేసకున్నట్లు ప్రచారం జరిగింది. తర్వాత, దర్యాప్తు కేవలం లక్డారం క్రషర్లకే పరిమితం కావడం.. ఆరుట్ల, చిన్నకంజర్లలోని క్రషర్ల జోలికి వెళ్లకపోవడంతో ఎమ్మెల్యే కుటుంబం ఊపిరి పీల్చుకుంది.

నగదు లావాదేవీలపై ఆరా

జిల్లా మైనింగ్, రెవెన్యూ అధికారుల తనిఖీల దర్వాత మైనింగ్ శాఖకు రూ. 342 కోట్లు సీనరేజీ సొమ్ము ఎగవేశారని తేల్చి, ఈమేరకు నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈడీ రంగంలోకి దిగినట్లు తెలిసింది. ఉదయం 7 గంటలకు పటాన్‌చెరుకు చేరుకున్న ఈడీ అధికారుల బృందం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంటికి చేరుకుంది. మరో బృందం శాంతినగర్‌లోని ఆయన సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఎమ్మెల్యే ఇంట్లోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రదేశాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు పహారాకాశాయి. నివాసాలతో పాటు కార్యాలయాల్లోనూ సోదాలు జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు చేశారు. ఈ సందర్భంగా విలువైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన కోట్లాది రూపాయల నగదు లావాదేవీలు, ఆస్తుల కొనుగోళ్లు, ఆదాయ మార్గాలపై ఈడీ దృష్టి కేంద్రీకరించింది. అక్రమ క్రషర్ల ద్వారా వచ్చిన సంపాదన ద్వారా కొనుగోలు చేసిన ఆస్తుల వివరాలనూ సేకరించారని తెలిసింది. పెద్దఎత్తున బినామీ ఆస్తుల వివరాలు, ఇటీవల కొనుగోలు చేసిన ఖరీదైన కార్ల వివరాలు సైతం సేకరించారని తెలిసింది.



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నివాసం

పార్టీ మార్పుపై జోరుగా చర్చ

మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరుగుతున్నది. కానీ, ఎమ్మెల్యే మాత్రం పార్టీ మారే ప్రసక్తే లేదని అనుచరుల వద్ద గట్టిగా చెబుతున్నారని తెలిసింది. అయినా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరుతారని వార్తలు వచ్చిన ప్రతీసారి మహిపాల్‌రెడ్డి పేరు ముందుకు రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలు పూర్తవగానే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే ఈడీ మహిపాల్‌రెడ్డిపై దృష్టి సారించడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌లోకి వెళ్లాలన్న ఆలోచనలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఒత్తిడి పెంచడానికే ఈ ప్రయత్నమని ప్రచారం జరుగుతున్నది.

ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాలలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

సంగారెడ్డి రూరల్, జూన్ 20 : సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోని ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాలలో గురువారం ఎఫ్ఎస్ఎస్ఏఐ, మొబైల్ ప్రయోగశాల, ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. వంటగది అపరిశుభ్రంగా ఉండటం, ఈగలు వాలడం, మైదా పిండిలో లక్క పురుగులు, కూరగాయలు నిల్వ చేసే ప్రదేశంలో సాలెపురుగులు ఉండడాన్ని గ్రహించారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేంద్ర మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ క్రాంతి ఆదేశాల మేరకు తనిఖీలు చేశామన్నారు. కల్తీ జరిగినట్టు అనుమానం కలిగిన పదార్థాలను సేకరించి ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. నాసిరకమైన, గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

24 నుంచి సంక్షేమాధికారుల పరీక్షలు

- ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో నిర్వహణ
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూన్ 20 : గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమశాఖ పరిధిలోని వసతి గృహాల్లో సంక్షేమాధికారుల పోస్టుల కోసం నిర్వహించనున్న గ్రేడ్-2 పరీక్షలు 24 నుంచి 29వ తేదీ వరకు నర్సాపూర్ బీవీఆర్‌ఐటీలో జరుగనున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మొదటి సేషన్ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ ఉంటుందన్నారు. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఈ పరీక్షలకు 3700 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు.

కారు ఢీకొని యువకుడి మృతి

ములుగు, జూన్ 20: కారు ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా ములుగులో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ములుగు గ్రామానికి చెందిన ఎర్రోళ్ల జశ్వంత్(17) ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం ఇంటి నుంచి కాలేజీకి బయలుదేరాడు. సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో ములుగు రోడ్డుపై కారు ఢీకొట్టింది. స్థానికులు వెంటనే యువకుడిని గజ్వేల్ ఆసుపత్రికి తరలించగా వైద్యులు సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్‌కి తరలించాలని సూచించారు. కుటుంబసభ్యులు లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వైద్యం చేస్తున్న క్రమంలో పరిస్థితి విషమించడంతో జశ్వంత్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


యోగాసనం వేస్తున్న గురుకుల విద్యార్థులు

ఆరోగ్య యోగం

- మానసిక ఒత్తిడి, రుగ్మతులు దూరం
- యోగాభ్యసనపై పెరుగుతున్న ఆసక్తి
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్/చేర్యాల, జూన్ 20: యోగా సర్వరోగ నివారిణిగా నిలుస్తుంది. యోగాభ్యాసం మానసిక, శారీరక సమస్యలే కాకుండా అనేక రుగ్మతలను దూరం చేస్తుందని యోగా నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన యోగా ప్రస్తుతం పట్టణాలు, పల్లెల్లోనూ ప్రాచుర్యం పొందింది. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం

ప్రాచీన నేపథ్యం

యోగా ప్రాచీన కాలం నాటి విద్యగా ప్రాచుర్యం పొందింది. యోగశాస్త్రం భారత భాగవతాల రచనకు మూలాధారమని, దాని ఆధారంగా చేసుకొని పురాణాలలోని పాత్రలు నిర్మించబడ్డాయని పౌరాణికుల అభిప్రాయం. యోగశాస్త్ర విశిష్టతను తెలియజేస్తూ, రామాయణంలో రాముడికి, వశిష్ఠునికి మధ్య జరిగిన సంవాదం యోగవాసిష్ఠంగా ప్రసిద్ధికి ఎక్కింది. వేద సారాలైన ఉపనిషత్తులు సైతం యోగప్రాముఖ్యతను వెల్లడించాయి. ప్రత్యేకంగా యోగతత్వోపనిషత్ మానవ జీవనంలో యోగాభ్యసనం కీలకమైన పాత్ర పోషిస్తుందని, సంసారిక జీవనంతో పాటూ ఆధ్యాత్మిక జీవనానికి అవసరమైన మానసిక బలాన్ని అందజేస్తుందని తెలుపుతోంది.

రోగ నివారిణిగా..

శారీరక, మానసిక ప్రశాంతత, మనోబలంతో పాటు సంగ్రహణశక్తిని పెంచే విజ్ఞాన ప్రక్రియ యోగా. ఆసనాల పేరిట అవసరమైనంత శ్రమను కలిగించి శరీరంలోని హార్మోన్‌లు నియమిత పరిమాణంలో నిర్ణీత సమయాల్లో విడుదల కావడానికి దోహదపడుతుంది. అలోపతి వైద్యులు సైతం ప్రస్తుత ఒత్తిడి జీవనంలో యోగా ప్రాధాన్యాన్ని గుర్తించి ఆ దిశగా వివిధ వ్యాధిగ్రస్తులను యోగా వైపు ప్రోత్సహిస్తున్నారు. మధుమేహం, అధిక రక్తపోటు, కొలెస్టరాల్, హృద్రోగాలు, వెన్నునొప్పి వంటి వాటిని నివారించే ఔషధంగా నిలుస్తుంది. జీర్ణ సంబంధిత వ్యాధులను నిర్మూలించి, ఎసీడిటీ నుంచి ఉపశమనాన్నిస్తుంది. మెడ, మోకాళ్లు, కండరాల నొప్పులు తదితర దీర్ఘకాలిక వ్యాధులు పలు ఆసనాలతో దూరమవుతున్నాయి. హైపర్ థైరాయిడిజాన్ని నిర్మూలించేందుకు ఉపయోగపడుతుంది. ఆసనాలతో పాటు ప్రాణయామం ద్వారా సాఫీగా ఊపిరితిత్తుల ప్రక్రియ, శ్వాసక్రియ రేటు పెరుగుదలకు దోహదం చేస్తుంది. అందుకే ఇటీవలి కాలంలో చాలా మంది యోగా వైపు ఆసక్తి చూపుతున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలగడంతో పాటు మనోవికాసం పెంపొందుతుంది. నేచురల్ లైఫ్‌స్టైల్ ఎక్స్‌పర్ట్‌గా, ఆహార ఔషధంగా పనిచేస్తుంది. యోగా ఆరోగ్య అంశాలు నలుగురికి పంచాలన్న సంకల్పంతో ఇటీవల ఉచిత యోగా శిక్షణ శిబిరాల నిర్వహించాం. నిరంతరంగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ ఒక్కరూ దైనందిన జీవితంలో యోగా అలవర్చుకుని ఆరోగ్యం పొందాలి.

- నర్సింగరావు, యోగా గురు, చేర్యాల

దీర్ఘకాలిక వ్యాధులకు చెక్



యోగాసనాలతో దీర్ఘకాలిక వ్యాధులు పక్షవాతం, కిడ్నీ, షుగర్, బీపీ లాంటి వాటికి చెక్ పెట్టవచ్చు. అలోపతిక్ మందులతో తగ్గని వ్యాధులు యోగాతో పూర్తిగా కోలుకున్నవారు ఎందరో ఉన్నారు. నిత్యం ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు ప్రత్యక్ష తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతీ సంవత్సరం మాదిగానే యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. యోగా భవనం పనులు పూర్తి కావపోవడంతో జిల్లా గ్రంథాలయంలో నిర్వహిస్తున్నాం.

- నవాజ్‌రెడ్డి, పతంజలి యోగా సమితి సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

యోగాతో ఆరోగ్యం పదిలం

నిత్యం వివిధ పనులపై ఒత్తిడితో ఉండేవారికి యోగాభ్యసన ఉపశమనం కలిగిస్తుంది. ఎంత ఒత్తిడితో ఉన్నప్పటికీ అర గంట యోగా చేసినా ముఖంలో ప్రశాంతతతో కూడుకున్న కళ పెరుగుతుంది. ఎలాంటి ఛాలెంజ్‌నైనా తేలిగ్గా స్వీకరించగలరు. మంచి ఆర్యోగమే కాదు.. ఉన్నత విలువతో కూడిన సమాజ నిర్మాణం కూడా యోగాతో సాధ్యపడుతుంది.

- దేవేందర్‌రెడ్డి, యోగా శిక్షకుడు, మెదక్




సంగారెడ్డిలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

ఉచిత యోగా తరగతులు

యోగాతోనే పరిపూర్ణమైన ఆరోగ్యం, దీర్ఘాయుషు లభించి జీవితం నిశ్చితంగా సాగిపోతుందని యోగా గురువు ఆకుల రవి ప్రచారం చేస్తున్నారు. మెదక్ పట్టణానికి చెందిన ఆకుల రవి కాంట్రాక్ట్ ఉపాధ్యాయునిగా పని చేస్తూ 1990 పతంజలి యోగా కేంద్రం కేంద్రం ద్వారా ఉచితంగా అనేక మందికి యోగా శిక్షణను అందించారు. ఇప్పటి వరకు 10 వేల మందికి శిక్షణ ఇచ్చారు. యోగాతో ఒత్తిడి దూరమవుతుందని, జ్ఞాపక శక్తి ఇనుమడిస్తుందని ఆయన బోధిస్తున్నారు. 2014 నుంచి వశిష్ఠ యోగా కేంద్రం ఆధ్వర్యంలో నిత్యం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉచిత యోగా తరగతులను నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తింపుగా పలు అవార్డుల అందుకున్నారు.













శాస్త్రీయ సంగీత వెలుగు.. శ్వేతాశర్మ

- శారద సంగీత విద్యాలయం ద్వారా విద్యార్థులకు శిక్షణ
- ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రదర్శనలతో ఆదరణ
- నేడు ప్రపంచ సంగీత దినోత్సవం

సంగారెడ్డి రూరల్, జూన్ 20 : కళా ప్రదర్శనలతో శాస్త్రీయ సంగీతానికి వన్నె తెస్తున్నారు శ్వేతాశర్మ. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణానికి చెందిన రామ్‌భట్ శర్మ పలువురికి శాస్త్రీయ సంగీతంలో శిక్షణ ఇచ్చారు. ఆయన మరణానంతరం ఆ బాధ్యతలను మనవరాలు శ్వేతాశర్మ తన భుజస్కందాలపై వేసుకున్నారు. సంగారెడ్డి పట్టణంలోని మంజీరానగర్‌లో 2017లో శారద సంగీత విద్యాలయాన్ని నెలకొల్పి శాస్త్రీయ సంగీతాన్ని బోధిస్తున్నారు. ఐదుగురు విద్యార్థులతో ప్రారంభించి ప్రస్తుతం 96 మందికి పైగా శిక్షణనందిస్తున్నారు. శ్వేతాశర్మ ఓ పక్క శాస్త్రీయ సంగీతంలో శిక్షణ అందిస్తూనే తన విద్యార్థులతో కలిసి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రదర్శనలిస్తున్నారు. వీటితో పాటు టీవీ, రేడియో కార్యక్రమాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చి పలువురి ప్రశంసలు, అవార్డులు అందుకున్నారు. శ్వేతాశర్మతో పాటు వారి ఇద్దరు కూతుళ్లు అశ్రిత, అక్షయ కూడా శాస్త్రీయ సంగీతంలో ప్రావీణ్యం పొంది తల్లిబాటలో నడుస్తున్న తనయలుగా పేరు తెచ్చుకుంటున్నారు.


విద్యార్థులతో కలిసి ప్రదర్శన ఇస్తున్న శ్వేతాశర్మ

శాస్త్రీయ సంగీతంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తారు



ప్రస్తుతం యువత పాశ్చత్య సంగీతానికి అలవాటు పడి శాస్త్రీయ సంగీతాన్ని మర్చిపోతున్నారు. మా తాతయ్య కాలంలో శాస్త్రీయ సంగీతానికి మక్కువ ఎక్కువగా ఉండేది. శాస్త్రీయ సంగీతానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాను. నా భర్త శ్రీనివాస్ ప్రోత్సాహంతో పలు కార్యక్రమాల్లో పాల్గొని కచేరీ ఇస్తున్నాను. కచేరీలకు వచ్చిన వారు శాస్త్రీయ సంగీతంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నారు.

- శ్వేతాశర్మ, శిక్షకురాలు, సంగారెడ్డి

నాగులపల్లి ఔటర్ వద్ద ఆర్వోబీని పూర్తి చేయాలి

దక్షణ మధ్య రైల్వే జీఎంకు మెదక్ ఎంపీ రఘునందన్ వినతి


వినితిపత్రం సమర్పిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ నేతలు

పటాన్‌చెరు, జూన్ 20: రామచంద్రాపురం మండలం ఈదులనాగులపల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు విస్తరణకు వీలుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను తక్షణం పూర్తిచేయాలని మెదక్ ఎంపీ రఘునంధన్‌రావు దక్షణ మధ్య రైల్వే జీఎంకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన జీఎం అరుణ్‌కుమార్ జైన్‌తో ఔటర్ వద్ద సర్వీస్ రోడ్డు ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలపై చర్చించారు. లింగంపల్లి శంకర్‌పల్లి మధ్య ఉన్న రైల్వే లైను ఔటర్ రింగ్ రోడ్డు కింది నుంచి ఉండటంతో సర్వీస్ రోడ్ల నిర్మాణం జరగలేదని వివరించారు. ఆర్వోబీ పనులు ప్రారంభం పూర్తి స్థాయిలో కొనసాగడకపోవడంతో కొల్లూరు జంక్షన్, ఈదులనాగులపల్లి గ్రామాల వద్ద పెద్దఎత్తున ట్రాఫిక్ జాం జరుగుతోందని వివరించారు. ట్రాఫిక్ సమస్యకు ఇబ్బందులు లేకుండా ఉండేలా ఆర్వోబీ పనులను తక్షణం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ రఘునంధన్‌రావు విజ్ఞప్తులపై జీఎం సానుకూలంగా స్పందించారు. తక్షణం ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి ఆర్వోబీల పురోగతిని సమీక్షిస్తామన్నారు. పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ వెంట బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, నాయకులు సందెళ్ల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ధర్మరక్షణకు తోడ్పాటునందించాలి

- విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ధనుంజయ

తొగుట, జూన్ 20 : ధర్మరక్షణకు ప్రతీ ఒక్కరూ తోడ్పాటునందించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ధనుంజయ పిలుపునిచ్చారు. గురువారం తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్కృతి దీక్ష యజ్ఞానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 27 కుటుంబాల నుంచి క్రైస్తవ మతంలోకి మారిన 105 మందిని తిరిగి హిందూ ధర్మాన్ని స్వీకరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మంలోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రముఖలు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ మ్యూజియంను సందర్శించిన కలెక్టర్ కుటుంబసభ్యులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 20 : సంగారెడ్డిలోని సర్ సీవీ రామన్ సైన్స్ మ్యూజియంను గురువారం కలెక్టర్ వల్లూరు క్రాంతి కుటుంబసభ్యులు సందర్శించారు. మ్యూజియం ఆవరణలోని బొటానికల్ గార్డెన్‌లోని మొక్కలను పరిశీలించి బాగుందంటూ కితాబిచ్చారు. వారి వెంట జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ కార్యాలయ భవనం ప్రారంభం

ప్రొటోకాల్‌పై బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య రగడ


భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

గుమ్మడిదల, జూన్ 20 : గుమ్మడిదలలో నూతన ఎంపీపీ కార్యాలయ భవనాన్ని ఎంపీపీ సద్ది ప్రవీణ భాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్‌తో కలిసి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీరెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు నక్క మంజుల, ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య ఘర్షణ చోటుసుకున్నది. శిలాఫలకంపై ప్రొటోకాల్ ప్రకారం పేర్లు లేవని కాంగ్రెస్ ఎంపీటీసీలు వాగ్వావాదానికి దిగారు. ఇరు పార్టీ వర్గాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు.

చెస్ బాక్సింగ్‌పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఎంపీ సన్మానం

నారాయణఖేడ్, జూన్ 20 : అంతర్ జాతీయ చెస్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన అన్నాచెల్లెళ్లను గురువారం జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్ నారాయణఖేడ్‌లోని తన స్వగృహంలో సన్మానించారు. కేరళలోని త్రివేండ్రమ్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయ ఛాంపియన్‌షిప్‌పోటీల్లో సీనియర్ మహిళా విభాగంలో కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం దక్కడ్‌పల్లికి చెందిన ప్రతిభ మూడు బంగారు పతకాలు సాధించగా, ఆమె సోదరుడు విజయ్‌రాఘవేందర్‌రావు పురుషుల విభాగంలో వెండి పతకం సాధించారు.


క్రీడాకారులను సన్మానిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

నులిపురుగుల నివారణకే ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

● ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి

గజ్వేల్, జూన్ 20: నులిపురుగుల నివారణకే అల్బెండజోల్ మాత్రల పంపిణీ చేస్తున్నట్లు శాసనమండలి సభ్యులు వంటేరి యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళితో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగాయ ఆయన మాట్లాడుతూ.. కడుపులో ఉన్న నులి పురుగుల నివారణకు ఈ అల్బెండజోల్ మాత్రలు పనిచేస్తాయని, జిల్లాలోని ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సున్న పిల్లలందరికీ ఈ మాత్రలను వేయించాలన్నారు. ఆయనవెంట జడ్పీటీసీ పంగ మల్లేశం, కౌన్సిలర్లు అర్చన శివకుమార్, వైద్యాధికారి బల్బీర్‌సింగ్, ఖాసీం, అనిత, సుజాత, వాసుదేవ్, రమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు ఉన్నారు.

● **చిన్నకోడూరు:** ఆరోగ్యవంతమైన సమాజాన్ని రాబోయే తరానికి అందించడానికి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ సూచించారు. మండలంలోని చిన్నకోడూరు ఉన్నత పాఠశాల, అల్లీపూర్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులకు వైస్ ఎంపీపీ పాపయ్యతో కలిసి నులిపురుగుల నివారణ మాత్రలు వేసి మాట్లాడారు. నులిపురుగులు పిల్లల ఎదుగుదల పై ప్రభావం చూపుతాయన్నారు. అనంతరం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అల్లీపూర్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను శాలువాతో సన్మానించారు. కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినీలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఇన్‌చార్జి ఎంఈవో యాదవరెడ్డి, పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

● **వర్గల్:** వర్గల్ జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వర్గల్ జడ్పీటీసీ బాలుయాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలకు ఒకసారి అల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వల్ల కడుపులోని నులి పురుగులు చనిపోతాయన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి హరిత, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్‌గౌడ్, వైద్య సిబ్బంది శ్రీనివాస్, తిరుపతమ్మ, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్: ప్రజ్ఞాపూర్‌లో విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

● **దుబ్బాక/మిరుదొడ్డి:** జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా దుబ్బాక, మిరుదొడ్డి మండలలాల్లో నులిపురుగు మాత్రలను పంపిణీ చేశారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్, రామక్కపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, మిరుదొడ్డి మండలం మిరుదొడ్డి, భూంపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. దుబ్బాక పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి, రామక్కపేట గురుకుల పాఠశాలల్లో ఎంపీపీ కొత్తపుష్పలత, మిరుదొడ్డి ఎంపీపీ గజ్జెల సాయిలు విద్యార్థులకు నులిపురుగు మాత్రలను వేశారు.

● **రాయపోల్:** జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు డీపీహెచ్‌వో ఇన్‌చార్జి మాణిక్యం మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వడ్డెపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● **సిద్దిపేట రూరల్/నారాయణరావుపేట:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట రూరల్ మండలం చింతమడకలో మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మెడికల్ ఆఫీసర్ భాస్కర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్. సునీత, బాపురెడ్డి, సీహెచ్‌వో జాకీర్ హుస్సేన్, హెచ్‌ఈవో జనార్దన్‌రెడ్డి, ఏఎన్‌ఎం సుజాత, ఆశా వర్కర్లు బాలమణి, రేణుక తదితరులు పాల్గొన్నారు

● **తొగుట:** తొగుట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినిలకు ఆల్బెండజోల్ మాత్రలను తొగుట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు రాధాకిషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశావర్కులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు: విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

● **చేర్యాల:** నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొమురవెల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కొమురవెల్లి జడ్పీఎస్ఎస్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారి శంకరన్ ఆచార్య పాల్గొనగా, ఆయా గ్రామాల్లోని చిన్నారులకు వైద్య సిబ్బంది మాత్రలు వేశారు.

● **దౌల్తాబాద్:** మండల కేంద్రంతో పాటు తదితర గ్రామాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి నాగరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్, దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, అయుష్ వైద్యాధికారి రాణి, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది ప్రభాకర్, ఏఎన్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● **కుకునూరుపల్లి:** మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పర్వీన్ విద్యార్థులకు స్వయంగా మాత్రలు వేశారు.

● **నంగునూరు:** నంగునూరు మండలంలోని గట్లమల్యాలలో పీహెచ్‌సీ వైద్యాధికారి అంజలిరెడ్డి మాత్రలు పంపిణీ చేసి మాట్లాడారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రల పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో రాజగోపాలపేట హెచ్‌ఈవో స్వామి, ఎంఎల్‌హెచ్‌పీ శివ కిషోర్‌రెడ్డి, గట్ల మల్యాల పీహెచ్ఎన్ జయమ్మ, సూపర్ వైజర్ పద్మాబాయి, ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



వర్గల్: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ బాలుయాదవ్



రాయపోల్: వడ్డెపల్లిలో నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న డీపీఎంవో కృపలాదేవి



తొగుట: కేజీబీవీ పాఠశాలలో నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న దృశ్యం



దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న దృశ్యం



సిద్దిపేట రూరల్/నారాయణరావుపేట: చింతమడక మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల..



కుకునూరుపల్లి: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న వైద్యాధికారి పర్వీన్



నంగునూరు: గట్ల మల్యాల అంగన్‌వాడీలో చిన్నారులకు మాత్రలు వేస్తున్న అంజలిరెడ్డి



దుబ్బాక: రామక్కపేట గురుకులంలో మాత్రలను పంపిణీ చేస్తున్న దుబ్బాక ఎంపీపీ కొత్త పుష్పలత

ఆర్థిక సహాయం అందజేత

రాయపోల్, జూన్ 20: మండలంలోని లింగారెడ్డిపల్లికి చెందిన సఫాయి కార్మికుడు మంద వీరేశం తన కుమార్తె కవితను గజ్వేల్ మండలం గిరిపల్లికి చెందిన ఎంకమల్లస్వామికి ఇచ్చి వివాహం చేశాడు. ఈ దంపతుల కుమారుడు ప్రణీత్ అనారోగ్యానికి గురి కావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా రెండు కిడ్నీలు, లివర్ చెడిపోయాయని డాక్టర్లు చెప్పడంతో విస్తుపోయారు. దీనికి దాదాపు 30 నుంచి 40 లక్షల వైద్య ఖర్చుల నిమిత్తం అవసరం ఉంటుందన్నారు. లింగారెడ్డిపల్లి గ్రామస్థులు మానవత్వంతో సఫాయి కార్మికుడి మనువడి వైద్య ఖర్చుల నిమిత్తం సేవా సమితి లింగారెడ్డిపల్లి సభ్యులు రూ. 60000 గురువారం అందించారు.

మృతుడి కుటుంబానికి నాగపురి ఆర్థిక సహాయం

చేర్యాల, జూన్ 20: చేర్యాల మండలం ముస్త్యాలకు చెందిన బీద కుటుంబీకుడు మేరిండ్ల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాంగ్రెస్ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ గురువారం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుడి ముగ్గురు కూతుళ్ల చదువుకు సహాయం చేస్తామని భరోసా కల్పించారు. 5వేలసహాయాన్ని అందజేశారు.

చేర్యాలలో ఆటో దగ్ధం

చేర్యాల, జూన్ 20 : చేర్యాల పట్టణ శివారు పెద్దమ్మగడ్డ కాలనీలో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌కు జరిగి ఆటో దగ్ధమైన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన ఒగ్గు శ్రీశైలం ఆటోను రాత్రి ఇంటివద్ద పార్క్ చేశాడు. అర్ధరాత్రి వేళ మంటలు వెలువడుతుండడాన్ని చూసి చుట్టుపక్కలవారు అతడిని అప్రమత్తం చేశారు. అప్పటికే ఆటో మంటల్లో పూర్తిగా దగ్ధమైపోయింది. ఈ విషయమై గురువారం శ్రీశైలం చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

25న స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశ పరీక్ష

చేర్యాల, జూన్ 20: స్పోర్ట్స్‌స్కూల్‌లో 4వ తరగతి ప్రవేశాల కోసం ఈనెల 25వతేదీన చేర్యాల పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయ సమీపంలోని గ్రౌండ్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలో పాల్గొనేవారు సెప్టెంబరు 1, 2015 నుంచి ఆగస్టు 31-2016 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ఎత్తు, బరువు, 3.3మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బోర్డు జంపింగ్, 5.80మీటర్ల రన్, 10మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్టులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిలో ప్రతిభ కనబరిచిన 10మంది బాలురు, 10మంది బాలికలకు ఈనెల 29వతేదీన సిద్దిపేటలో జిల్లాస్థాయి, జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20మంది బాలబాలికలకు జూలై 9న రాష్ట్రస్థాయి ఎంపికలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం 9494876376, 9951569191ను సంప్రదించాలని కోరారు.

మునిసిపల్ అభివృద్ధికి కృషి


● మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ. రాజమౌళి



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్

గజ్వేల్, జూన్ 20: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పరిధిలోని 20వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కౌన్సిలర్ వంటేరు గోపాల్‌రెడ్డితో కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తున్నామని తెలిపారు. ఆయా వార్డుల్లో సీసీ రోడ్లను పూర్తి చేశామని, దశలవారీగా అన్ని వార్డులలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఆయనవెంట మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య, మహిళా నాయకురాలు ఉమా గోపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు పేపర్ శ్రీనివాస్, మునిసిపల్ సిబ్బంది ఉన్నారు.

ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ శ్రీను

చేర్యాల, జూన్ 20: చేర్యాల మండలం కడవేరుగు గ్రామశివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 15మంది గాయాలపాలైన విషయం తెలిసిందే. ఈ సంఘటన నేపథ్యంలో చేర్యాల పోలీసులు గురువారం ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా చేర్యాల సీఐ శ్రీను స్థానిక గాంధీచౌక్, సినిమా థియేటర్ ఏరియాలలోని ఆటోడ్రైవర్లు, ప్రయాణీకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోవద్దని, ప్రతీ డ్రైవర్ విధిగా డ్రెస్ ధరించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట ఎస్ఐ దామోదర్ తదితరులు ఉన్నారు.

పచ్చిరొట్ట సాగుతో నేల సారవంతం



పచ్చిరొట్ట సాగును పరిశీలిస్తున్న అధికారులు

కొండపాక, జూన్ 20: పచ్చిరొట్ట సాగుతో నేల సారవంతమవుతుందని వ్యవసాయశాఖ గజ్వేల్ డివిజన్ ఏడీఏ బాబు నాయక్ పేర్కొన్నారు. మండలంలోని వెలికట్ట గ్రామంలో గురువారం రైతులు సాగు చేసిన జీలుగా, పచ్చిరొట్ట పంటను పరిశీలించారు. జీలుగతో భూమి సారవంతంకావడంతో పంట దిగుబడి పెరుగుతుందన్నారు. అలాగే నత్రజని పోషకం నేరుగా మొక్కకు అందుతుందన్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ అధికారి ప్రియదర్శిని, ఏఈవో రమ్యశ్రీ ఉన్నారు. కొండపాక మండలం వెలికట్ట క్రాస్‌రోడ్ వద్ద ఉన్న రైతు ఆగ్రోస్ ఎరువుల దుకాణాన్ని వ్యవసాయశాఖ అధికారులు విజిలెన్స్ అధికారులతో కలిసి గురువారం తనిఖీ చేశారు. గజ్వేల్ వ్యవసాయ శాఖ ఏడీఏ బాబునాయక్ ఏవో ప్రియదర్శిని విజిలెన్స్ అధికారులు దుకాణాన్ని పరిశీలించారు. బిల్లులను, రికార్డులను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొమురవెల్లిలో విద్యుత్ సిబ్బంది వసూళ్ల పర్వం

● సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన స్థానికులు

● గ్రామంలో విచారణ చేసిన చేర్యాల ఏడీఈ

చేర్యాల, జూన్ 20: కొమురవెల్లి మండలంలో పలువురు విద్యుత్ సిబ్బంది రైతులు, ప్రజల దగ్గర వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇంటిదొంగల్లా మారి విద్యుత్ పరికరాలు, సామగ్రి విక్రయించుకుంటూ, ఉన్నతాధికారుల అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చేతులు తడిపితేనే విద్యుత్ సేవలు అందిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఆయా అంశాలపై మండల కాంగ్రెస్ నాయకులకు పలువురు బాధితులు విన్నవించడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేస్తూ, అధికారులకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ నాయకుడు, ఐనాపూర్ మాజీసర్పంచు చెరుకు రమణారెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఐనాపూర్, తపాస్‌పల్లి గ్రామాల జూనియర్ లైన్‌మెన్లు రమేశ్, కట్టర్ నర్సింహులు కలిసి ఏఈ మధు అండదండలతో అక్రమవసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇళ్లు, బోరు మోటార్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటుకు డీడీలు చెల్లిస్తామని పలువురి నుంచి డబ్బులు వసూలు చేసి మూడేళ్లవుతున్నా బిగించలేదని తెలిపారు. ఐనాపూర్ నుంచి తపాస్‌పల్లికి వెళ్లే దారిలో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన కరెంటు స్తంభాల వైర్లతో పాటు గురువన్నపేట-తపాస్‌పల్లి దారిలో ఎల్‌టీలైన్ 8 స్తంభాల కేబుల్‌వైర్‌ను అమ్ముకున్నారని, ట్రాన్స్‌ఫార్మర్ మార్చడానికి తపాస్‌పల్లికి చెందిన ఓ రైతువద్ద రూ.30వేలు లంచం తీసుకున్నారని ఆరోపించారు. ఫ్యూజ్ మార్చినా, జంపర్ కట్ అయినా రూ.500-1000చొప్పున తీసుకుంటున్నారని, వీరి అక్రమవసూళ్లలో ఏఈకి కూడా భాగస్వామ్యం ఉందన్నారు. డబ్బులు, మద్యం అందిస్తేనే రైతుల వ్యవసాయబావులవద్దకు వస్తున్నారని, లేకుంటే ముప్పుతిప్పలు పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని బద్ నాం చేస్తున్నారని, ఈవిషయమై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈవిషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో చర్చనీయాంశమైంది. చేర్యాల ఏడీఈ రత్నవీరాచారి గ్రామానికి చేరుకుని ఆరా తీశారు. పలువురు రైతులు వినతిపత్రం అందించడంతో లైన్‌మెన్ రమేశ్, కట్టర్ నర్సింహులు తదితరులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



గ్రామానికి వచ్చిన ఏడీఈకి వినతిపత్రం అందిస్తున్న చెరుకు రమణారెడ్డి, రైతులు

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు

● వర్గల్ తహసీల్దార్ బాల్‌రాజ్

వర్గల్, జూన్ 20: మండలంలోని వేలూర్ గ్రామ శివారులో సర్వే నెంబర్ 337లో భూమిని అక్రమించి సాగు చేస్తే వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వర్గల్ తహసీల్దార్ బాల్‌రాజ్ గురువారం హెచ్చరించారు. వేలూర్ గ్రామ పరిధిలోని గురుమన్న గుట్ట దగ్గర సర్వేనెంబర్ 337 పట్టా ఉన్న వారు సర్టిఫికెట్లలో ఎంత విస్తీర్ణం ఉందో అంతే సాగు చేసుకోవాలని, అంతకు మించి భూమిని కబ్జా చేసి సాగు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి నియామకం



కూతురు రాజిరెడ్డి

నంగునూరు, జూన్ 20: రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్(ఐజేయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని నర్మెట్టకు చెందిన కూతురు రాజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఖమ్మం పట్టణంలో జరిగిన తృతీయ మహాసభలలో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడు దశాబ్దాలుగా రాజిరెడ్డి జర్నలిస్టుగా కొనసాగుతున్నారు. రాజిరెడ్డి ఎన్నిక పట్ల ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కలకుంట్ల రంగాచారి, పైడిపల్లి అరుణ్ కుమార్, రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు నన్నె అజయ్‌కుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తాడూరులో పోలీసుల కనువిప్పు

చేర్యాల, జూన్ 20: మండలంలోని తాడూరులో బుధవారం రాత్రి చేర్యాల పోలీసుల ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కళాబృందం రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలు, మద్య సేవించడం వల్ల కలిగే అనర్థాలు, మూఢనమ్మకాలు, గంజాయి సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావలు, ఇతరత్రా అంశాలపై కళాప్రదర్శనలతో అవగాహన కలిపించారు. చేర్యాల సీఐ శ్రీను మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాలు, నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తోటివారితో స్నేహపూర్వకంగా మెదలాలన్నారు. గ్రామాల్లో ఎవరన్నా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

● మునిసిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్‌రూరల్, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద, మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నేడు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు జరిగే యోగా కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథులు హాజరుకానున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ ధర్మవీర్ యోగా శిక్షణ గురువు అయిలేని అనిత యోగా ఆసనాలు, ప్రాణాయామాలు, మెడిటేషన్ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పట్టణంలోని వాకర్స్ రన్నర్స్, స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆయిల్‌పామ్ సాగుపై ట్రైనీ ఉద్యాన అధికారులకు శిక్షణ



ట్రైనీ అధికారులకు శిక్షణ ఇస్తున్న నాగేందర్‌రెడ్డి

మర్కుక్. జూన్ 20: రాష్ట్రంలో నూతనంగా ఎంపికైన ఉద్యాన అధికారులకు ఆయిల్‌పామ్ సాగు, డ్రిప్ నిర్వహణపై మర్కుక్ గ్రామంలోని జీవన్‌రెడ్డి అనే రైతుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి సువర్ణ మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం శ్రమించినా కొన్నిసార్లు పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు కురిసి రైతాంగం నష్టపోతున్నదని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ పెట్టుబడి ఆశించిన ఆదాయం చేతికి వస్తోందని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి టి. నాగేందర్‌రెడ్డి డ్రిప్ ద్వారా నీటితో పాటు ఎరువులను ఎలా వాడాల్లో తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆయిల్ ఫెడ్ అధికారి శంకర్, ఉద్యాన అధికారి సౌమ్య, విస్తరణ అధికారులు రజనీకాంత్, విష్ణువర్దన్, రైతులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి

కుకునూరుపల్లి, జూన్ 20: 'కోళ్ల వ్యర్థాలు యథేచ్ఛగా చెరువులోకి' అన్న శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతి ప్రచురితమైన కథనానికి డీపీవో దేవకిదేవి స్పందించారు. చెరువుల్లో కోళ్ల వ్యర్థాలను వేస్తున్న చికెన్‌షాప్ యజమానులపై చర్యలు తీసుకోవాలన్న ఆమె ఆదేశానుసారం ఉమ్మడి కొండపాక మండల ఎంపీడీవో వెంకటేశ్వర్లు, కుకునూరుపల్లి తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి చికెన్‌షాపు యజమానులతో సమావేశం నిర్వహించారు. బహిరంగ పదేశాల్లో, చెరువుల్లో, కుంటల్లో చికెన్ వ్యర్థాలను వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, గ్రామపంచాయతీ చట్టాన్ని అతిక్రమిస్తే రూ. 25000 నుంచి 1,00000 వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించి వారికి నోటీసులు జారీ చేశారు.

మంచినీటి సమస్యకు పరిష్కారం



మిషన్ భగీరథ పైపులైన్‌కు మర్మతులు చేయిస్తున్న అధికారులు

దౌల్తాబాద్, జూన్ 20: మండల పరిధిలోని ముత్యంపేట గ్రామంలో మిషన్ భగీరథ పైపు లైన్ పగిలి మంచి నీళ్లు రాక బోర్ల వద్ద ట్యాకర్లతో చాలి చాలని మంచి నీళ్లతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. బుధవారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో 'సగం ఇళ్లకే భగీరథ నీళ్లు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన మిషన్ భగీరథ అధికారులు, ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ సాయి కృష్ణ, ఏఈ విస్లేష్, ఎంపీవో సయ్యద్ ఘఫూర్, సుమన్. పంచాయతీ కార్యదర్శి అర్జున్, తదితరులు పైప్‌లైన్ లీకేజీకి మర్మతులు చేయించి భగీరథ నీళ్లు అందించారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

అధిక ఫీజులు, పుస్తకాలు విక్రయిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

● డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

హుస్నాబాద్‌రూరల్, జూన్ 20: హుస్నాబాద్ పట్టణంలో ప్రభుత్వ నిబంధనకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా పుస్తకాలు విక్రయిస్తున్న కార్పొరేట్ స్కూల్స్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, గురువారం ఓ ప్రైవేట్ స్కూల్ ఎదుట డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివరాజ్ మాట్లాడుతూ.. హుస్నాబాద్ పట్టణంలోని కొన్ని ప్రైవేట్ స్కూల్స్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారని, ఆ పాఠశాలలను తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా వ్యాపారమే ధ్యేయంగా స్కూల్ యాజమాన్యాలు పనిచేస్తున్నాయని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు సంబంధిత స్కూల్స్‌ను తనిఖీ చేసి సీజ్‌చేయాలని డిమాండ్ చేశారు. మండల విద్యాధికారి ఆదేశానుసారం సిబ్బంది స్కూల్‌ను సందర్శించి అనుమతి లేని పుస్తకాలు విక్రయిస్తున్న స్టోర్‌రూంను సీజ్‌చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రాజునాయక్, రవీందర్, సంపత్, అరవిందఠాకూర్, సాయి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్' అవకతవకలపై కేంద్రం స్పందించాలి

● బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి. రవీందర్

హుస్నాబాద్‌రూరల్, జూన్ 20: నీట్ పరీక్షల అవకతవకలపై కేంద్ర మౌనం వీడి విద్యార్థులకు న్యాయం చేయాలని బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లో గురువారం నిర్వహించిన బీఎస్పీ సమావేశంలో మాట్లాడారు. ఒకే పరీక్ష కేంద్రంలోని 8 మంది విద్యార్థులకు 720 మార్కులు రావడం, దేశవ్యాప్తంగా 60 మందికి 720 మార్కులు అనుమానాలకు తావిస్తుందన్నారు. గ్రేస్ మార్కుల పేరిట నిబంధనలకు విరుద్ధంగా మార్కులు కలపడం ఏమిటని ప్రశ్నించారు. ఈ వ్యవహారం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరగడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ఈ లీకేజీ వ్యవహారంపై ఈడీ, సీబీఐతో విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, నాయకులు సుధాకర్, వేల్పుల రాజు తదితరులు ఉన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


నంగునూరు, జూన్ 20: ఆరుకాలం కష్టపడి రైతులు పండించిన పంటలకు కేంద్రం మద్దతు ధర ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతిరెడ్డి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు జీడిపల్లి రజినికర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరోసారి రైతు ప్రభుత్వం అని నిరూపించుకుందన్నారు. రైతుల ఆర్థిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని 2024-25 మార్కెటింగ్ సీజన్ కోసం వరితోపాటు 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర పెంచుతూ, నిర్ణయం తీసుకోవడం పట్ల రైతుల సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చౌడుచెర్ల వెంకట్రామిరెడ్డి, నాయకులు కోల సతీష్ గౌడ్, జీడిపల్లి రజనికర్‌రెడ్డి, బురుగు శ్రీనివాస్‌గౌడ్, తుపాకుల నరేష్, పప్పు సురేందర్‌రెడ్డి, వస్తాదుల యాదగిరి పాల్గొన్నారు.

చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

● బీఆర్‌ఎస్ సిద్దిపేట యువజన నాయకులు

సిద్దిపేట టౌన్, జూన్ 20: కాంగ్రెస్ చేవెళ్ల డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు డిమాండ్ చేశారు. సిద్దిపేట పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అమలుకాని ఎన్నో హామీలు ఇచ్చి, గద్దెనెక్కిన కాంగ్రెస్ 10వ తరగతి పాసైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 10వేల వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మక్క సారక్క గిరిజన గ్రామీణాభివృద్ధి పథకం (ఎస్ఎస్‌జీజీఏపీ) ద్వారా ప్రతీ గూడెం, తండాలకు ప్రతీ ఏడు ఇస్తామన్న రూ. 25లక్షలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ అభయహస్తం పథకం ద్వారా ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షల ఆర్థిక సహాయాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సామల్ల సాయిప్రేమ్, గుడికందుల నరేష్, భూక్య భిక్షపతినాయక్, సందులపురం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం తరగతి గదికి తాళం



తాళం వేసిన గది

నంగునూరు, జూన్:20 గత ప్రభుత్వం హయాంలోలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాల భవనం నిర్మించగా, అందుకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన కాంట్రాక్టర్, నర్మెట ప్రాథమిక పాఠశాల మాజీ విద్యా కమిటీ చైర్మన్ మాంకాల నర్సింహులు తరగతి గదికి గురువారం తాళం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను చైర్మన్‌గా ఉన్న సమయంలో రెండు తరగతి గదుల నిర్మాణం కోసం రూ.19 లక్షలు మంజూరు అయ్యాయని, గదుల నిర్మాణం పూర్తి చేశానని పేర్కొన్నారు. పనులు పూర్తి చేసిన తర్వాత రూ 15 లక్షలు మాత్రమే అధికారులు మెజర్మెంట్ చేశారని తెలిపారు. ఇందులో తనకు రూ 6 లక్షల వరకే బిల్లులు వచ్చాయని, మిగిలిన రూ 9 లక్షలు పెండింగ్‌లో పెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్ పాఠశాల గదికి తాళం వేయడంతో విద్యార్థులను వరండాల కూర్చొపెట్టి బోధన చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడి అభ్యర్థన మేరకు మధ్యాహ్నం తర్వాత గది తాళం తీసినట్లు సమాచారం.